# బ్రేక్


– సుగుణ

"దేనికైనా నమ్మకం వుండాలి. అది భగవంతుడి మీదే కానవసరం లేదు. మీరు చేపట్టిన వృత్తి మీద కావచ్చు. మీరు ఇష్టపడే వ్యక్తి మీద కావచ్చు. మీరు ఓటువేసి గెలిపించే రాజకీయ నాయకుల మీద కావచ్చు. ఏదైనా సరే! నమ్మాలి! అప్పుడే ప్రగతి సాధించగలం. ఒక్క నమ్మకం అన్న పదం మీదే జీవితం నడుస్తుంది. మనకు లభించిన ఈ మానవజన్మని సార్థకం చేసుకోవాలంటే, నమ్మకాన్ని ఆసరాగా తీసుకుని, గమ్యం దిక్కుగా పయనించండి. మీ మార్గం అతిసుగమం అవుతుంది. నన్ను నమ్మండి."

సముద్రపు గాలి జుట్టుని చెల్లాచెదురుగా రేపుతూంటే, సర్దుకోనైనా సర్దుకోక ఒక చెయ్యి కిటికీ అంచున మోపి, రెండో చేత్తో అలవోకగా స్టీరింగు పట్టుకుని, స్వామి అతీతానంద తన ఉపన్యాసంలో పలికిన గంభీర వాక్యాలు మనసులో మెదులుతూ వుండగా, కారు నడుపుతున్నాను. రోడ్డువారగా ఓ పద్దెనిమిదేళ్ల అమ్మాయి, బొటనవేలు నగరపు దిక్కుగా చూపుతూ కనిపించింది. లిఫ్ట్ అడుగుతోందని అర్థమైంది. ఎక్కించుకోనా? వద్దా! మొన్నే ఎవరో అమ్మాయి ఇలాగే లిఫ్ట్ అడిగి, కత్తి చూపించి, కారు ఓనరు వాచీ, మనీపర్సు, ఉంగరం, మెళ్లో ఉన్న దుబాయ్ గోల్డ్ చెయినూ, అన్నీ కాజేసి ఉడాయించిందట. అక్కడే తుప్పల్లోంచి దాని బాయ్‌ఫ్రెండ్ మోటారు సైకిలు మీద దూసుకొచ్చి, ఆ పిల్లనెక్కించుకుని చిటికెలో మాయం అయిపోయాడట. వద్దొద్దు! ఎవరినీ నమ్మకూడదు!

కారు స్పీడు పెంచి ఎస్టేట్ వైపు దూసుకుపోయాను. కారు నడపడం నాకెంతో ఇష్టం. కఠినమైన రాళ్ల మార్గాల్లోంచీ, ఇసుక తిన్నెల మధ్యనుండీ, అతి సులువుగా కారు నడపగలను. అలవాటైపోయింది. ఎన్నిసార్లు అటువంటి దార్లలో ప్రయాణించవలసి వచ్చిందో! అదీ అర్ధరాత్రి వేళల్లో.

స్పీడు పెంచానే కానీ, స్వామీజీ మాటలు మళ్లీ ఆలోచనల్లోకి వచ్చాయి.



ఇదేమిటి! ఇప్పటికప్పుడే ఆయన ప్రవచనం మర్చిపోయాను! వెంటనే కారు వెనక్కి తిప్పాను, ఆ అమ్మాయిని ఎక్కించుకోవడానికి. ఏదెలా వున్నా, వూరంతా నన్నెంతో గౌరవిస్తుంది. అందరికీ సాయపడే మహిళ అని బిరుదు కూడానూ. బిరుదు సార్థకం చేసుకోవద్దూ?

తెల్లారే, లాన్‌లో కూర్చుని కాఫీ తాగుతున్నాను. ఉదయం వచ్చే వార్తాపత్రికలు పట్టుకుని దివాన్‌గారు వచ్చారు.

''ఈ వార్త చూడండి, అమ్మా! పద్దెనిమిదేళ్ల పిల్లట. ఎవరో చంపేసి, నిర్దాక్షిణ్యంగా మారుమూల తుప్పల్లో విసిరేశారట. శవాన్ని గుర్తుపట్టలేనంతగా ముఖం చితికిపోయి వుందిట. ఏమిటో ఘోరాలు జరిగిపోతున్నాయి'' అన్నారాయన పేపర్లు నా చేతిలో పెడుతూ.

''ఏ డబ్బున్న కుర్రాడినో ప్రేమించి వుంటుంది. పెళ్లికొప్పుకోక వాళ్లు ఇలా మట్టం చేసి ఉంటారు. ఏమిటో! ఈ అమ్మాయిలు తిన్నగా చదువుకోక, ప్రేమ వ్యవహారాల్లో దిగి, ఇటువంటివి కొని తెచ్చుకుంటారు. ఏం చేయగలం? ఈ వార్తలు విని బాధపడడం తప్ప'', అన్నాను.

''అవును తల్లీ! నిజమే. ఏమిటో ఈ ఘాతుకాలు'' అంటూ ఆయన ఆఫీసు గదిలోకి వెళ్లిపోయారు.

పద్దెనిమిది! ఈ వయసు చాలా చెడ్డది.

ఈ వయసులోనే రాజాగారు నన్ను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. ఆరుగురు ఆడపిల్లల్లో ఆఖరి దాన్ని నేను. అక్కలందరికీ పెళ్లిళ్లు చేసి, అల్లుళ్లను తృప్తిపరిచే సరికి నాన్నగారి కాస్త ఆస్తీ హరించుకుపోయింది. కాలేజీ వార్షికోత్సవాల్లో సంగీతం, నృత్యం, నటన, ఈ రంగాల్లో అన్ని ప్రైజులూ నేనే అందుకుంటూంటే, ప్రైజులిస్తున్న రాజాగారు నామీద నుంచి కళ్లు తిప్పుకోలేకపోయారు. ఆ మర్నాడు ప్రిన్సిపల్ గారు నాన్నకి కబురుచేసి, రాజాగారు నన్ను వివాహం చేసుకోవడానికి ఉత్సాహపడుతున్నట్లు చెప్పారు. నాన్నగారు సంతోషం పట్టలేకపోయారు. అప్పటికి రాజాగారి వయసు నలభై. తండ్రిగారి ఆస్తి వంశపారంపర్యంగా సంక్రమించి పదేళ్లయింది. ఎవరూ నచ్చక పెళ్లి చేసుకోకుండా వుండిపోయారు.

ఎప్పుడూ ఎస్టేట్ వ్యవహారాల్లో తలమునకలుగా వుంటూ, ఏ స్త్రీనీ కన్నెత్తియినా చూడని రాజాగారంటే అందరికీ ఎంతో మర్యాదా, మన్ననానూ. ఇటువంటి సంబంధం ఏ కట్నమూ, ఖర్చూ లేకుండా ఒళ్లో వచ్చిపడేసరికి నాన్నగారు వెంటనే ఒప్పేసుకున్నారు. రాజాగారు స్ఫురద్రూపి. ఆయనని చూడగానే నేనూ ఏదో తెలియని ఆకర్షణకు లోనై వయసు తేడాని పట్టించుకోక పెళ్లికి అంగీకరించాను. మా కళ్యాణం అత్యంత వైభోగంగా జరిగింది. కాపురమూ ఎటువంటి అరమరికలూ లేకుండా సాఫీగా సాగిపోయింది. ఇల్లంతా ఎంత మెత్తని తివాసీలున్నా, వాటిపై నడిస్తే నా పాదాలు కందిపోతాయనేవారు రాజాగారు. ఏ పనీ ముట్టుకోనిచ్చేవారు కాదు. నా మీద అపారమైన ప్రేమ కురిపించేవారు. ఆ ప్రేమ జల్లులో నేను తడవని రోజుండేది కాదు.

పనులన్నిటికీ దాస, దాసీజనం వున్నా, కారు నడిపే డ్రైవర్ని పెట్టుకోలేదు రాజాగారు. ఎక్కడికెళ్లినా ఆయనే కారు నడపాలి. నేను పక్కన కూర్చుని పాటలు పాడాలి. మా అపూర్వ వైవాహిక బంధానికి ఒక నిదర్శనం ఇది. ఒకసారి మంకుపట్టు పట్టి నాకూ డ్రైవింగ్ నేర్పమని రాజాగారిని అడిగాను. ముందు కాస్త తటపటాయించినా, చివరికి సరేనని నేర్పారు. అతిత్వరలో డ్రైవింగ్ పట్టుబడింది. ఊరికి కాస్త దూరం వెళ్లేవరకూ ఆయనని నడపనిచ్చి, తర్వాత నేను డ్రైవింగ్ సీట్లో కూర్చుని, కారు నడుపుతూ ఆయనని పాడమనేదాన్ని. ఏవో అపస్వరాలు పాడేవారు. విరగబడి నవ్వేదాన్ని. అప్పుడు ఆయన నావంక చూసే చూపుల్లో వెదజల్లే ప్రేమానురాగాలు నేనెన్నటికీ మరువలేనివి. ఏవో కారణాల వల్ల మాకు సంతానభాగ్యం లేకపోయింది. అయినా ఆ లోటు పెద్దగా తెలిసేది కాదు మాకు. మా అన్యోన్య దాంపత్యంలో అసంతృప్తికి చోటుండేది కాదు. ఇలా ఇరవయ్యేళ్లు గడిచాయి.

రాజాగారి షష్టిపూర్తి దినోత్సవానికి జనం తండోపతండాలుగా వచ్చారు. రాజాగారి చిన్ననాటి స్నేహితుడు సూర్యప్రకాష్, తన యుక్తవయసులో వున్న కూతురు కాంచనమాలతో సహా పక్క వూరి నుంచి వచ్చాడు. కాంచన కలివిడైన పిల్ల. విందుకొచ్చిన అతిథులని పలకరిస్తూ, చలాకీగా అటూ, ఇటూ తిరిగింది.

విందు హడావిడి తగ్గిన మర్నాడు, సూర్యప్రకాష్ తిరిగి వెళ్లడానికి సన్నాహపడుతూ, సామాన్లు సర్దుకుంటుంటే, ఏం కావాలో కనుక్కుందామని గదిలోకి వెళ్లాను.

''సునందాదేవీ! కాంచన తల్లి పోయి ఏడాదైంది. బెంగతో, దిగులుగా వుంటే బాధ మర్చిపోతుందని ఇక్కడికి తీసుకువచ్చాను. మీ అందరి మధ్యలో ఎంత ఉల్లాసంగా తిరిగిందో మీరే చూశారుగా. మీ అండలో కొన్నాళ్లుంచితే బెంగ తీరి మళ్లీ మామూలు మనుష్యుల్లో పడుతుందేమోనని ఆశ. కొన్నాళ్లు మీ వద్ద వదిలి వెళ్లనా?'' అన్నారు సూర్యప్రకాశ్ అర్థింపుగా.

''అదేమిటి! మీరంతగా అడగాలా? అలాగే వుంటుంది. కాంచనని మా స్వంత కూతురిలా చూసుకుంటాం. తనిష్టమొచ్చినన్నాళ్లు ఇక్కడ వుండవచ్చు'' అన్నాను సౌమ్యంగా.

ఆవిధంగా కాంచన మాతో ఆర్నెల్లపాటు వుండిపోయింది. తోటలో తిరుగుతూ, పూలని పలకరిస్తూ, పక్షుల కిలకిలారవాలు టేప్‌లో పొందుపరుస్తూ, అంతటా సందడిగా వుండే కాంచనంటే మాకందరికీ అంతులేని అభిమానం కలిగింది. ముఖ్యంగా రాజాగారికి. ఆ అమ్మాయి రాకతో ఆయనలో ఒక నూతన ఉత్సాహం కలిగింది. ఎస్టేట్ వ్యవహారాలు కూడా పక్కనపెట్టి, ఎక్కువ సమయం కాంచనతో తోటలో గడపసాగారు. అందరం ముచ్చటపడ్డాం.

ఒకనాడు మహిళా సమాజానికి వెళ్లవలసి వచ్చి, కారుకోసం గరాజ్ వైపు నడిచాను. కారు లేదు.

''రాజావారు అమ్మాయి గారిని తీసుకుని బయటికి వెళ్లారమ్మా'' అన్నాడు నౌకరు.

నాకు చెప్పకుండా ఎక్కడికి వెళ్లి వుంటారు? ఏదోలే, అని సరిపెట్టుకుని, మహిళా మండలికి రాలేనని కబురు చేశాను.

సంధ్యవేళ కారు శబ్దం విని బయటకొచ్చి చూశాను. రాజాగారూ, కాంచనా కారులోంచి దిగుతున్నారు. కాంచన డ్రైవింగ్ సీటులోంచి దిగింది.


''నువ్వు కారు నడుపుతావా?'' అన్నాను ఆశ్చర్యంగా.


''ఇన్నాళ్లూ లేదక్కా! ఇవ్వాళే!'' అంది కళ్లు మెరిసిపోతుంటే.

''ఒక్కరోజులో కారు నడపడం నేర్చేసుకుంది కాంచన, చూశావా!'' అన్నారు రాజాగారు సంబరంగా.

''బావుంది. లోపలికి పదండి. స్నానాలవీ చేసి, భోజనం చేద్దురుగాని'' అని లోపలికి నడిచాను.

భోజనం చేస్తున్నంతసేపూ కాంచన తన డ్రైవింగ్ విశేషాలు చెప్తూనే వుంది. రాజాగారి దృష్టి






కాంచనపైనుంచి ఒక్కసారి కూడా మళ్లలేదు.

ఇంక ఆరోజు మొదలు ప్రతిదినం డ్రైవింగ్‌కని ఇద్దరూ బయటకు వెళ్లిపోయేవారు. ఒకనాడు, భోజనాల వేళ, కాంచన –

''అక్కా! రాజాగారి పాట విన్నావా, నువ్వెప్పుడైనా? భలే గమ్మత్తుగా వుంటుందిలే. ఒక శ్రుతి వుండదు, ఒక రాగం వుండదు. అన్నీ అపస్వరాలే! అసలు మాటలేమిటో కూడా అర్థంకాదు'' అంది నవ్వుతూ.

నేను రాజాగారి వంక చూశాను. కళ్లు దించుకుని అన్నం తింటున్నారు.

''నేనెప్పుడూ వినలేదే! నీకోసం ప్రత్యేకంగా నేర్చుకుని వుంటారు'' అన్నాను నేనూ చిరునవ్వుతో.

రాజాగారు కళ్తెత్తలేదు.

ఓ నాలుగు రోజులయాక నాకోసం ఇంకో కారు కొనుక్కున్నాను. ప్రస్తుతం నేను నడిపే కారు అదే. వీళ్ల మూలంగా నా పనులన్నీ ఆగిపోతూ వుండేవి. కాంచన ఎల్లవేళలా రాజాగారిని అంటిపెట్టుకునేది. రాజాగారికి పిల్లలు లేని కారణంగా కూతురిలా చూసుకుంటున్నారని అంతా ఎంతో ఆనందపడ్డారు. కానీ, ఆయన ప్రవర్తనలోనూ, అప్పుడప్పుడు, కాంచనవైపు చూసే ఆ కళ్లల్లోనూ నాకా భావం ఏమాత్రం కనిపించేది కాదు.

ఒకనాడు కారు స్పీడుగా పోర్టికోలోకి తీసుకొచ్చి సడన్ బ్రేక్‌వేసి ఆపాను. కీచుమన్న శబ్దానికి,దివాన్‌గారు కంగారుగా బయటికి పరిగెత్తుకొచ్చారు.

''జాగ్రత్త తల్లీ! డ్రైవర్ని పెట్టుకోకూడదా? ఈ కొండల్లో కారు నడపడం ఎంత కష్టం!'' అన్నారు, సహజ వాత్సల్యంతో.

''ఫర్వాలేదండీ. డ్రైవర్లు మాత్రం తిన్నగా నడుపుతారని ఎలా చెప్పగలం? అయినా, నా కారు ఎప్పటికప్పుడు కండిషన్‌లో వుంచుకుంటున్నాను. మెకానిక్ గోవింద్ కారుని ఎలా కాపాడుకోవాలో చక్కగా చెప్తాడు. చిన్నచిన్న రిపేర్లు కూడా ఎలా చేసుకోవచ్చో నేర్పుతాడు. ఇదిగో! ఇప్పుడే సడన్ బ్రేక్ ఎలా వేయాలో నేర్చుకుని వస్తున్నాను. ఆ ప్రయోగమే ఇది. మిమ్మల్ని గాభరా పెట్టినట్టున్నాను'' అన్నాను, నవ్వుతూ.

''ఏమో తల్లీ! నీకు తెలియనిదేముంది'' అని ఆయన ఆఫీసు గదిలోకి వెళ్లిపోయారు.

ఒకనాడు డ్రైవ్‌కి వెళ్లిన రాజాగారూ, కాంచనా తిరిగి రాలేదు. కొండకింద రాళ్లల్లో కారు పడిపోయి వుంది. నలిగి పిప్పయిపోయిన కారులో ఇద్దరూ చిక్కుపడిపోయి, ప్రాణాలు కోల్పోయారు. మరుసటిదినం పోలీసులకి ఆవిధంగా కనిపించారు. కారు కంట్రోల్ తప్పి, కొండపక్క లోయలో పడిపోయిందని పోలీసులు నిర్ధారించారు. కాంచన డ్రైవరు సీటులో వుంది.

''చిన్నపిల్ల! సరిగ్గా ఇంకా చేతకాకుండానే కారు నడిపేది. ఎంత అనర్థం జరిగిపోయింది'' అన్నారంతా విచారంగా.

రాజాగారి మరణానంతరం ఎస్టేట్ వ్యవహారాలన్నీ నా చేతిలోకి వచ్చాయి. సహజంగా వచ్చిన తెలివితేటల వల్ల పనులన్నీ సమర్థవంతంగా నిర్వహించేదాన్ని. కాలం జరుగుతూపోయింది.

గత స్మృతుల నుంచి వర్తమానంలోకి వచ్చి, పేపర్లో పడిన అమ్మాయి ఫోటో చూశాను. శరీరం రక్తమయంగా వుంది. ముఖం బండరాయితో చితక్కొట్టి చంపినట్లు కనిపించింది. నా చేతులు చూసుకున్నాను. ఎర్రగా కందిపోయి వున్నాయి. రాయి గరుగ్గానూ, బరువుగానూ వుంది.

ఆరోజు కారు వెనక్కి తిప్పి, లిఫ్ట్ అడిగిన అమ్మాయి దగ్గర ఆపాను. ఆశ్చర్యంగా నా వంక చూసింది.

''రామ్మా! ఈ రూట్‌లో బస్సులు ఎక్కువగా రావు. చీకటి పడుతోంది. నేను నిన్ను మీ యింట్లో దింపుతాను. ఎక్కు!'' అన్నాను డోర్ తెరుస్తూ. చేతిలో వున్న చిన్న ట్రావెల్ బ్యాగ్‌తో ఆ అమ్మాయి కార్లో ఎక్కి సర్దుకుని కూర్చుంది.

''పేరేమిటి?'' అన్నాను కారు పోనిస్తూ.

''మణిమేఖల'' అంది కొంచెం తమిళ యాసతో.

''చదువుకుంటున్నావా?'' అడిగాను.

''అవును మేడం. మా అమ్మా, అప్పా చెన్నైలో వుంటారు. నేనిక్కడ ఇంజనీరింగ్ చదువుతున్నాను. హాస్టల్ సెలవలకి మూసేశారు. రాత్రి పదకొండు గంటలకి ట్రైన్. అంతవరకూ ఎలా గడపాలో తెలియడంలేదు. ఏదైనా హోటల్లో మీల్స్ తిని, స్టేషన్‌లో వెయిట్ చేస్తాను. లిఫ్ట్ ఇస్తున్నందుకు థాంక్యూ మేడమ్. ఏదైనా జంక్షన్‌లో దింపేయండి, చాలు'' అంది ఆ అమ్మాయి, నమ్రతగా.

''ఎక్కడో ఏం అవస్థ పడతావు కానీ, నాతో రా. మా యింట్లో భోంచేసి వెళుదువుగాని. స్టేషన్‌లో నేను దిగబెడతానులే'' అన్నాను ఆప్యాయంగా.

''సరే మేడం'' అని ఆ అమ్మాయి సంతోషంగా తలూపింది. హాస్టల్స్‌లో వున్న పిల్లలు కొంచెం ప్రేమ కనబరిస్తే చాలు, ఎంతో స్పందిస్తాను.

కారు నెమ్మదిగా కొండదారుల్లో నడుపుతున్నాను.

''మీ ఇల్లెక్కడ మేడం?'' అంది మణిమేఖల.

''వూరికి కాస్త దూరం. ఫర్వాలేదులే. ట్రైన్‌కి ఇంకా బోలెడు టైముంది'' అన్నాను.

ఆ అమ్మాయి రిలాక్సయిపోయి, ఏం కనిపించకపోయినా, చీకట్లోకి, సముద్రంవైపు చూస్తూ కూర్చుంది.

సడన్ బ్రేక్ ఏశాను. ముందుకి తూలిపడబోయి, తమాయించుకుని, ''ఏమయింది మేడం?'' అంది.

''నేచర్స్ కాల్. పద అలా తుప్పల్లోకి వెళ్దాం. కాస్త అడ్డంగా నిలబడుదువుగాని'' అన్నాను.

ఇద్దరం కారు దిగాం. తుప్పల్లోకి కొంచెం లోపలికి నడిచాను, రోడ్డుకి కనపడకుండా. ఆ అమ్మాయి అక్కడే నిలబడింది. ఈ దార్లు అన్నీ నాకు సుపరిచితమే. పొదల మొదట్లో ఒక బండరాయి కనిపించింది. దాన్ని లేవనెత్తి, రెండు చేతుల్తోనూ పట్టుకుని ఆ అమ్మాయి నుల్చున్న దిశగా నడిచాను. అలికిడి విని, ''అయిందా మేడం?'' అని ఇటు తిరిగింది.

ఇంటికి చేరి స్నానం చేసి, ఒళ్లు మరిచి నిద్రపోయాను. నిద్రలో కల! గోవింద్ కారు బ్రేక్స్ ఎలా ఫెయిలవుతాయో చెప్తున్నట్లు!

ఆరోజు రాజాగారూ, కాంచనా డ్రైవ్‌కి బయలుదేరేముందు, కారు బ్రేక్స్‌తో కాసేపు ఆడుకుని, గోవింద్ నేర్పిన మెకానిజం ఆచరణలో పెట్టాను. మణిమేఖల విషయంలో, తియ్యని మాటలతో నా నటనా చాతుర్యం ఉపయోగించి, కార్యాన్ని సాధించగలిగాను. ఇన్నేళ్లుగా సమయానికి తగినట్లుగా, అనేక పద్ధతులు ఉపయోగించి, పనులు చేసుకుంటున్నాను. నా ఈ మేధస్సు మీద నాకు అపారమైన నమ్మకం, స్వామీజీ చెప్పినట్లు.

పద్దెనిమిది! ఈ వయసు చాలా చెడ్డది! దానిని సంపూర్ణంగా నిర్మూలించడమే నా ధ్యేయం. ఆ దిశగానే, నమ్మకంతో సాగిపోతున్నాను.

★